జిల్లా ట్రాన్స్‌కో కార్యాలయమేదీ?

- అంతా గందరగోళం
- కార్యాలయం ఏర్పాటుపై స్పష్టత నిల్
- 55 పోస్టుల సర్దుబాటు ప్రక్రియ ఎప్పటికో..?
- పోస్టింగ్‌కు లక్షలు డిమాండ్ చేస్తున్న ప్రజాప్రతినిధులు
- ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు


చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరుకు కొత్తగా ట్రాన్స్‌కో ఎస్‌ఈ(జిల్లా)కార్యాలయాన్ని కేటాయించారు. క్యాడర్ల వారీగా ఉద్యోగుల సంఖ్యను ప్రకటించారు. అక్టోబర్ 1 నుంచి చిత్తూరులో జిల్లా కార్యాలయం ప్రారంభించి సేవలు అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా కార్యాలయం ఏర్పాటు జాడే లేదు. సంబంధిత క్యాడర్ల భర్తీకి రాజకీయ సిఫార్సులతో వచ్చేందుకు ఎవరికి వారు తమ ప్రయత్నాలు చేస్తుండడంతో గందరగోళం నెలకొంది. ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలనే దానిపై తిరుపతిలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఇదే అవకాశంగా కొన్ని పోస్టులకు లక్షల్లో ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. తాము చెప్పిన వారికే వారికే క్యాడర్ వారీగా పోస్టింగ్ ఇవ్వాలని ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలియవచ్చింది.

అంతా గందరగోళం

చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో కార్యాలయం పరిధిలో ఏ డివిజన్లు వస్తాయి? అనే దానిపై స్పష్టత లేదు. చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పుంగనూరు, పుత్తూరు(కొంతభాగం) డివిజన్లను కలిపి ఏర్పాటు చేయాలని కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉద్యోగుల బదిలీల ప్రక్రియ శాఖలో ముగిసింది. కొందరు కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పుడు జిల్లా కార్యాలయానికి వెళ్లాలనే ప్రయత్నాలు సాగిస్తుండడంతో ఆ స్థానాల్లో ఎవరిని నియమిస్తారనేది చర్చకు తావివచ్చింది.

జిల్లాకు ఎస్‌ఈ:1, ఈఈ: 3, డీఈ:6, ఏఈ:12, జేఈ:4, ఎస్ఏఓ:1, ఏఏఓ:1, జేఏఓ:5, పీఓ:1, ఎస్ఏ:11, జేఏ:9 మంది చొప్పున మొత్తం 55 మందిని డిస్కం, సర్కిల్, డివిజన్ల కార్యాలయాల నుంచి సర్దుబాటు చేస్తామని సీఎండీ ప్రకటించారు. దీంతో ఇక్కడ పోస్టింగ్స్‌కు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది.

ఆత్రుత ఎందుకో..?

కొత్త కార్యాలయం, అందులో ఆన్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు వంటి సౌకర్యాలు కల్పించాలంటే కనీసం నెల పైనే పడుతుంది. అయితే అక్టోబర్ 1 నుంచి సర్కిల్ కార్యాలయం కూడా ప్రారంభించకపోవడం, ఇది ఎప్పుడు ప్రారంభిస్తారో సందిగ్ధత నెలకొని ఉండటంతో ఉద్యోగులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి కలిగింది. పునర్విభజన ప్రక్రియ కోసం ఉన్నతాధికారులు కనీసం ఉద్యోగ సంఘాల నాయకులు, అధికారుల నుంచి ఎలాంటి సలహాలు–సూచనలు స్వీకరించిన దాఖలాలు లేవని, ఉన్నతాధికారులు కొందరు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్పీడీసీఎల్ పరిధిలోని కొత్త సర్కిళ్ల ఏర్పాటు ప్రక్రియలో లోపాలు సరిచేయాల్సిన అవసరం ఉంటోందని ప్రస్తుత పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి.

పోస్టింగ్స్ ఎప్పుడు?

మొదట చిత్తూరులోనే జిల్లా కార్యాలయం ఏర్పాటు చేయాలనే ఆదేశించినా దీనికి తగిన ప్రభుత్వ భవనం ఇక్కడ లేదు. ఇక ప్రత్యామ్నాయంగా అద్దె భవనంలో ఏర్పాటు చేస్తారా? బాధ్యతలు స్వీకరిస్తారా? అనే సందేహాలు రేకెత్తుతున్నా, మరోవైపు- మొదట చిత్తూరులో కార్యాలయాన్ని ప్రారంభించి తర్వాత ఉద్యోగుల పంపకం ఉంటుందని భావిస్తున్నారు. చిత్తూరులో సర్దుబాటు చేయాల్సిన ఉద్యోగుల విషయంలో సిఫార్సుల లేఖలు, అనుభవం ఉన్నవారిని పరిగణనలోకి తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

– బాధ్యతల స్వీకరణలో ఆర్డీఓ శ్రీనివాసులు


కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో ప్రజా, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తానని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ ఆర్డీఓగా బదిలీపై వచ్చినట్టు చెప్పారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి సమస్యలపై అందే వినతులనును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తానన్నారు. చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో చాలా సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి వహిస్తామన్నారు. అనంతరం చిత్తూరు తహసీల్దార్ కళావతి, వివిధ మండలాల తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీఓ

చిత్తూరు కలెక్టరేట్ : కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ


మంగళ విద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ విద్యావాణి 29వ సంచికను మంగళవారం హెచ్‌ఎం రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఆవిష్కరించారు. తిరుపతికి చెందిన ఏఎస్ఐ సుధాకరపిళ్లై, విశ్రాంత ఉపాధ్యాయుడు రుషేంద్రపతిరెడ్డి ఈ సంచికకు దాతలుగా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించి ప్రత్యేక విద్యా మాసపత్రికను నడపడం చాలా సంతోషమని, రాష్ట్రంలో ఏ పాఠశాలలోనూ ఇలాంటి మాస పత్రికను నడపడం లేదని అన్నారు. విద్యార్థులలో రచనాశక్తిని పెంపొందించేందుకు ఇలాంటి విద్యా మాసపత్రికలు తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో గణిత అవధాని అరుణ్‌శివ ప్రసాద్, రమాదేవి సంజీవి, భారతి, పిళ్లారప్ప, సంపంగి, మోహన్‌రెడ్డి, ధనశేఖర్, ప్రేమ కృష్ణ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

- డీఈఓ కార్యాలయంలో అవగాహన కల్పించిన సీఐ నిత్యబాబు


డీఈఓ కార్యాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సీఐ నిత్యబాబు

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కోరారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 'నో హెల్మెట్–నో అడ్మిషన్ పాలసీ'ని జిల్లాలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రధానంగా తలకు తీవ్రగాయాలై మరణించే వారి సంఖ్య ఎక్కువని, హెల్మెట్ ధరిస్తే తలకు గాయాలు కాకుండా ప్రాణాపాయం నుంచి బైటపడేందుకు అవకాశం ఉంటుందన్నారు. డీఈఓ దేవరాజు మాట్లాడుతూ, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడపడం ప్రాణాంతకమన్నారు. ఇకపై కార్యాలయానికి ద్విచక్ర వాహనాల్లో వచ్చే సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్లు సత్యనారాయణ, రామ్‌కుమార్, వీజీ రమణ, సిబ్బంది గోపాల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

బంగారుపాళెం: మండలంలో భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్‌ను కోరారు. మంగళవారం సీపీఎం నాయకులు తహసీల్దార్‌ను కలిశారు. జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ, మండలంలోని కొత్తపల్లె గ్రామ కంఠంలో అనర్హులకు కేటాయించిన ఇండ్లపై సమగ్ర సర్వే చేయాలని కోరారు. అలాగే మొగిలిలో యానాదుల అనుభవంలో ఉన్న ఊరగుట్ట భూములను అగ్ర కులస్తులకు పట్టాలు మంజూరు చేశారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు సైతం అగ్ర కులస్తులకు కొమ్ము కాస్తూ ఎస్టీల కడుపు కొడుతున్నారని ఆరోపించారు. ఎస్టీలకు న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రన్, మురళి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకరన్, శేఖర్, వినోద్ పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న హాస్టల్ పైకప్పు


ఎస్సీ బాలికల హాస్టల్‌లో పెచ్చులూడిన దృశ్యం

గుడిపాల: స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ బిల్డింగ్ పైకప్పు పెచ్చులూడుతూండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థినులు బిక్కుబిక్కుమంటున్నారు. అంతేకాకుండా వర్షం కురిస్తే ఉరుస్తోంది. ఇక్కడ ఇక్కడ 20 మందికి పైగా విద్యార్థినులు ఉన్నారు. మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

బొమ్మసముద్రం పశువైద్యశాలలో..



బొమ్మసముద్రం పశువైద్యశాలలో పైకప్పు పెచ్చులూడుతోంది. జోరుగా వర్షం కురిస్తే బిల్డింగ్ మొత్తం ఉరుస్తోంది. దీంతో మందులు, సబ్సిడీపై రైతులకు పంపిణీ చేసే మొక్కజొన్న, జొన్నలు కూడా తడిసి పనికిరాకుండా పోతున్నాయి. అధికారులు దీనికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపునకు చెకుముకి దోహదం


చెకుముకి పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు




యాదమరి: బహుమతులు అందుకుంటున్న గెలుపొందిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు ప్రశ్నించేతత్వం కలిగి ఉండాలని సమగ్రశిక్ష సీఎంఓ జయప్రకాష్ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక సంతపేటలోని బృందావనం పాఠశాలలో చెకుముకి నగర స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఎంఓ మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి చెకుముకి సంబరాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. జనవిజ్ఞాన వేదిక సీనియర్ సభ్యులు మునిరత్నం మాట్లాడుతూ, సమాజంలో ఇప్పటికీ పలు చోట్ల మూఢ నమ్మకాలతో ఉండటం దురదృష్టకరమని, వాటిని వీడాలన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ శైలజ మాట్లాడుతూ, అమ్మాయిల చదువు దేశ భవిష్యత్తుకు పునాది అని అన్నారు. అనంతరం పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో పీసీఆర్ (ప్రథమ) వరదప్పనాయుడు స్కూల్ (ద్వితీయ), ప్రైవేట్ పాఠశాలల విభాగంలో (విజయం), ద్వితీయ బహుమతి రెయిన్‌బో, సంసిద్ధ్ క్యాంపోర్డ్ పాఠశాలల విద్యార్థులు గెలుపొంది బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో జేవీవీ నగర ప్రధాన కార్యదర్శి సుధాకర్, పాపుదేశి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి (పూతలపట్టు) : విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీతత్వంతో ముందుకు పోవాలని జన విజ్ఞాన వేదిక యాదమరి శాఖ అధ్యక్షులు జె .మధు అన్నారు. యాదమరి జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో చారుశ్రీ (9 వ తరగతి, జెడ్పీ వరిగపల్లె), అభినయ శ్రీ (9 వ తరగతి, జెడ్పీ హైస్కూల్, యాదమరి), ఉదయ్‌కిరణ్ (9వ తరగతి, కె.గొల్లపల్లె జెడ్పీ హైస్కూల్) విజేతలుగా నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో టీచర్లు నరసింహారెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



దుర్గాంబ దేవస్థానం వద్ద విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల భారీ విద్యుత్ దీపాలంకరణ కటౌట్, ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పందిరి

-విద్యుత్ అలంకరణతో ఆలయం, మండపం ముస్తాబు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు గిరింపేటలోని శ్రీదుర్గాంబ దేవస్థానం నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. గురువారం నుంచి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభకానున్నాయి. ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు వారం రోజుల నుంచే అమ్మవారి అలంకరణ, పూజ, గ్రామోత్సవ నిర్వహణ తదితర అంశాలపై చర్చించి ముందస్తు పనులు ప్రారంభించారు.అమ్మవారి ఆలయం ఎదుట మండపంతోపాటు విద్యుత్ దీపాలంకరణకు భారీ కటౌట్లు కట్టారు. అమ్మవారిని కొలువుదీర్చే చోట ప్రత్యేక వస్త్ర అలంకరణ చేశారు. క్యూలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలంకరణ దసరా బ్రహ్మోత్సవ శోభను తీసుకొచ్చింది. ఇక, అమ్మవారు గురువారం నుంచి 9 రోజులపాటు వివిధ రూపాల్లో దర్శనమిస్తారని, చివరి రోజు పుష్పపల్లకి సేవను వైభవంగా నిర్వహిస్తామని ఈవో మునిశేఖర్ తెలియజేశారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దు


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయకుండా టీడీపీ, జనసేన అడ్డుకోవాలని సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. మంగళవారం జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలతో విశాఖ ఉక్కు పరిశ్రమ వచ్చిందన్నారు. విశాఖ స్టీల్ పరిశ్రమ లాభాల బాటలో నడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం బడా పెట్టుబడిదారులు అయిన ఆదాని, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తోందని విమర్శించారు. దీన్ని వ్యతిరేకించాల్సిన బాధ్యత టీడీపీ, జనసేనల ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్ని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ను ప్రైవేటీకరణ ఆపకపోతే కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలతో అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ముగంరెడ్డి, రమాదేవి, విజయకుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత


గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

ఐరాల: గ్రామీణులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర పూర్ణలత అన్నారు. మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్యం ఎలా ఉందో ఆరా తీశారు. ఎవరైనా జ్వరం బారిన పడితే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుడిపాలలో 'ఫ్యామిలీ డాక్టర్'

గుడిపాల: మండల కేంద్రంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమహేష్ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, అలాగే బీపీ, షుగర్ ఉన్న వారికి ఆయా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులనూ పరీక్షించారు. అనంతరం ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు.వైద్య సిబ్బంది సోనియా, చంద్రశేఖర్, లత, సింధుజ పాల్గొన్నారు.

రైతులు ఉద్యాన పంటలపై ఆసక్తి చూపాలి


పుణ్యసముద్రంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తవణంపల్లె: రైతులు అధిక ఆదాయం వచ్చే ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపాలని ఉద్యానశాఖాధికారి సాగరిక పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పుణ్యసముద్రం, ద్వారకపురంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. హెచ్ఓ మాట్లాడుతూ, మామిడి ప్రత్యామ్నాయంగా ఇతర ఉద్యాన పంటల సాగుపై రైతులు మక్కువ చూపాలని కోరారు. నిమ్మ, చీని, బత్తాయి, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, అరటి..ఇత్యాది పంటలను సాగు చేసి ఆదాయం పెంచుకోవాలన్నారు. ఏఓ ప్రవీణ్ మాట్లాడుతూ, విత్తనశుద్ధి చేశాకే విత్తనాలు విత్తాలని, దీని వల్ల చీడపీడలను అరికట్టవచ్చన్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఉలవలు సాగు చేయడానికి మంచి అదును అని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో సాగు చేస్తే అధిక దిగుబడులు


ఐరాల: కొత్తపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించుకుని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏఓ వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లె, వడ్రాంపల్లెలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ, పంటలకు ఆశించే చీడపీడల నివారణకు మోతాదుకు మించి మందులు వినియోగిస్తే మిత్ర పురుగులు చనిపోతాయన్నారు. అంతేకాకుండా రైతులకు అదనపు పెట్టుబడి భారంతో పాటు పంటను వినియోగించే వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

చిత్తూరు కలెక్టరేట్: వే ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, పలు రకాల పోటీలు నిర్వహించనున్నట్లు వే ఫౌండేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు చంద్రకళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న తిరుపతి జిల్లా కేంద్రంలోని మహతి కళాక్షేత్రంలో భారతీయ కళా ఉత్సవం నిర్వహించనున్నట్టు తెలియజేశారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని, జిల్లాలో ఆసక్తి ఉన్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు ఇతర వివరాలకు 9177731019 నంబర్‌లో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

క్లుప్తంగా

బదిలీ పోలీసులకు వీడ్కోలు సన్మానం


బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

ఐరాల: మండలంలోని కాణిపాకం పోలీస్ స్టేషన్‌లో ఐదేళ్లుగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న నలుగురు కానిస్టేబుళ్లను ఎస్ఐ ధరణీధర, సిబ్బంది మంగళవారం వీడ్కోలు సన్మానం చేశారు. పోలీసులు నవీన్, కనికాచలం, నరసింహశెట్టి, రాజేషలను ఎస్ఐ శాలువాలతో సత్కరించి వారి సేవలను ప్రస్తుతించారు. ఏ పోలీస్ స్టేషన్‌లో పనిచేసినా అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలు, అధికారుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

సంస్కృతీ సాంప్రదాయాలను గౌరవించాలి


వివిధ వేషధారణలో విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు మన సంస్కృతీ సాంప్రదాయాలను గౌరవించాలని విజయం చైర్మన్ తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజ కోరారు. మంగళవారం సుందరరాజపురం వద్ద ఉన్న విజయం విద్యాసంస్థల్లో ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. దసరా పండుగ విశిష్టత గురించి వారు విద్యార్థులకు వారు తెలియజేశారు. విద్యార్థినులు నవ దుర్గల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కౌసల్య, టీచర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

చెకుముకి పోటీలు


పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు

బంగారుపాళెం: బంగారుపాళెంలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతిని అందుకున్నారు. ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అమరనాథరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండుటాకులకు మెరుగైన వైద్య సేవలు ముఖ్యం


మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పండుటాకులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరులో టెలిఫోన్ కాలనీలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, వయస్సు పెరిగే కొద్దీ పలు రకాల రుగ్మతలు పట్టి పీడిస్తాయని, సరైన పౌష్టికాహారం అందక కీళ్ల, మోకాళ్ల నొప్పులు, బీపీ, మధుమేహం..ఇత్యాది సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారన్నారు. అలాంటి వారికి ఆరోగ్య సూత్రాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శిరీష, శ్రీవాణి పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయిస్తే దుకాణాలు సీజ్

చిత్తూరు అర్బన్: మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని చిత్తూరులో బుధవారం మాంసం విక్రయించరాదని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే, డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్సు రద్దు చేయడంతో పాటు దుకాణం సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే హోటళ్లల్లో కూడా మాంసాహారం విక్రయించరాదన్నారు.

పింఛన్ల పంపిణీ

తవణంపల్లె: మండలంలో 9,432 మంది సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారని ఆయన చెప్పారు. మండలంలో 9724 మందికి మొత్తం రూ.4,00,78,500 మంజూరైందని, ఇందులో 9,432 మందికి రూ.3,91,13,500 పంపిణీ చేశామని, మిగిలిన వారికి బుధవారం పంపిణీ చేస్తామని తెలియజేశారు.